# నుమాయిష్'కు సర్వం సిద్ధం

**జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15 వరకు ఎగ్జిబిషన్**

**మధ్యాహ్నం 3.30 గంటల నుంచి రాత్రి 10.30 వరకు ప్రదర్శన**

**నుమాయిష్ ప్రవేశ రుసుము పెంపు**

**గతంలో రూ.30 ఉన్న టికెట్ ధరను రూ.40లకు పెంపు**



హైదరాబాద్, డిసెంబరు 30 ప్రభాతవార్త : నగరంలో ప్రతి ఏడాది నిర్వహించే పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన 'నుమాయిష్'కు రంగం సిద్ధమైంది. నుమాయిష్‌కు ఎప్పట్లాగానే నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వేదికగా నిలవనుంది. జనవరి 1న ప్రారంభమయ్యే ఈ ఎగ్జిబిషన్ ఫిబ్రవరి 15 వరకు జరగనుంది. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు ఈ ఎగ్జిబిషన్ ఉంటుంది. ఈ 82వ ఆలిండిచా ఇండస్ట్రియల్ ఎబ్జిబిషన్‌లో 2,400 స్టాళ్లు ఏర్పాటు చేశారు. వీటిలో విదేశీ సంస్థలకు చెందిన స్టాళ్లు కూడా ఉన్నాయి. కాగా, నుమాయిష్‌లో ఈసారి టికెట్ ధర పెంచారు. గతంలో రూ.30 ఉన్న టికెట్ ధరను ఇప్పుడు రూ.40కి పెంచారు. ఐదేళ్ల లోపు వయసున్న చిన్నారులకు ప్రవేశం ఉచితం అని నిర్వాహకులు తెలిపారు. ఎగ్జిబిషన్‌కు వచ్చే వారి వాహనాలకు ఉచిత పార్కింగ్ సదుపాయం కల్పిస్తున్నా రు. స్థానికంగా తయారయ్యే ఉత్పత్తులకు ప్రచారం, ప్రోత్సాహం అందించాల న్న ఉద్దేశంతో 1938లో నుమాయిష్ ప్రారంభమైంది. అప్పటి నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ఈ పారిశ్రామిక ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. మొదట్లో 50 స్టాళ్లతో ప్రారంభమైన నుమాయిష్ ఇప్పుడు 2వేలకు పైగా స్టాళ్లతో దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రదర్శనగా గుర్తింపు తెచ్చుకుంది. నగరంలో నిర్వహించే నుమాయిష్‌ను నిత్యం 45వేల మంది సందర్శిస్తారని అంచనా. కాగా, 2019లో నిర్వహించిన నుమాయిష్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగి వందలాది స్టాళ్లు కాలి బూడిదయ్యాయి. ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఈసారి ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. స్టాళ్ల నిర్వాహకులు ఎక్కడా వంటలు చేయకుండా నిషేధించారు. రెండు ఫైరింజన్లను అందుబాటులో ఉంచనున్నారు. విద్యుత్ వైర్లు, గ్యాస్ పైప్‌ల విషయంలో అత్యంత భద్రమైన ఏర్పాట్లు చేసుకోవాలని స్టాళ్ల నిర్వాహకులకు అగ్నిమాపక శాఖ స్పష్టం చేసింది. ప్రతిస్టాల్‌లోనూ ఫైర్ ఎక్స్ టింగ్విషర్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని పేర్కొంది.

# 1గంట వరకు బార్లు ఓపెన్

**అర్థరాత్రి 12గంటల వరకు వైన్స్‌లు కూడా ఓపెన్**

**బార్లు, క్లబ్‌లు, ఈవెంట్లకు 1గంట వరకు అనుమతి**



హైదరాబాద్, డిసెంబర్ 30, ప్రభాతవార్త: న్యూఇయర్ వేడుకలకు మరింత కిక్కు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మద్యం ప్రియుల కోసం అనవాయితీగా వెసులుబాటు కల్పించింది. శనివారం 31తేదీ అర్థరాత్రి 12గంటల వరకు మద్యం దుకాణాల్లో అమ్మకాలు జరిపేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేశారు. దీని ప్రకారం రాష్ట్రంలోని అన్ని మద్యం దుకాణాలు 31అర్థరాత్రి 12గంటల వరకు తెరిచే ఉంటాయి. ఇక, బార్, అండ్ రెస్టారెంట్లు, క్లబ్బులు, టూరిజయం డెవపల్ కార్పొరేషన్‌కు చెందిన హోటళ్లు 31వ తేదీ రాత్రి ఒంటిగంటవరకు తెరిచి ఉంటాయి. ఈవెంట్ పర్మిషన్లు తీసుకున్న వారు కూడా రానరతి ఒంటిగంట వరకు మద్యాన్ని సర్వ్ చేసుకోవచ్చు. అయితే ఈవెంట్లలో కొవిడ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

# నగరంలో బిజెపిని మరింత పటిష్టం చేయాలి

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో కిసాన్ మోర్చా నూతన కార్యవర్గం**

అడ్డగుట్ట, డిసెంబర్ 30 ప్రభాతవార్త: గ్రేటర్ హైదరాబాద్‌లో బిజెపి పార్టీతో పాటు అనుబంధ శాఖలను మరింత పటిష్టం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. ససికింద్రాబాద్ మహంకాలి జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు సి. హెచ్.కన్నాభిరామ్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన కార్యవర్గాన్ని శుక్రవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి పరిచయం చేయించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మహంకాలి జిల్లా అధ్యక్షుడు శా ్యంసుందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సారంగ పాని తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి ఎర్రబెల్లిని కలిసిన ఈజిఎంఎం ఉద్యోగులు



హైదరాబాద్, డిసెంబరు 30, ప్రభాత వార్త: హెచ్‌ఆర్ పాలసీ, వేతన స్థిరీకరణ చేయా లని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌ను ఈజి ఎంఎం ఉద్యోగులు కోరారు. ఈమేరకు మర్యాదపూ ర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ (పిఆర్ అండ్ ఆర్‌డి) మంత్రిత్వ శాఖ పరిధిలోని ఎంప్లాయిమెంట్ జనరేషన్ మార్కెటింగ్ మిషన్ (ఈజిఎంఎం)లో గత 2002నుంచి పనిచేస్తూ గ్రామీణ నిరుద్యోగ యువతకు గత 18ఏళ్లుగా వివిధధ నైపుణ్యాభివృద్ధి శిక్షణలు ,జాబ్‌మేళాలు నిర్వహించి వివిధ రంగాల్లో ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ఇప్పటివరకు తెలం గాణ 82వేలమంది యువతకు శిక్షణ ఇచ్చి 59వేలమందికి ఉద్యోగాలు కల్పించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈజిఎంఎం ఉద్యోగులు దాదాపు 110మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సి ంగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్నామన్నారు. తమకు హెచ్‌ఆర్ పాలసీ ఇచ్చేందుకు పదేళ్లక్రితం ఈసి మీటింగ్‌లో అనుమతి లభించిందని కానీ ఇప్పటివరకు జీవో జారీ చేయలేద న్నారు. కావున తెలంగాణ ప్రభుత్వం స్పందించి వెంటనే తమకు హెచ్‌ఆర్ పాలసీతో ఉద్యోగ భద్రత ఇవ్వాలని కోరామన్నారు. ఇందుకు మంత్రి కూడా సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

## ప్రగతిభవన్ ముట్టడికి గిరిజన సంఘాల యత్నం

హైదరాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త: సిఎం కెసిఆర్ ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలంటూ ప్రగతిభవన్ ముట్టడికి గిరిజన సంఘాలు యత్నించారు. జనాభా దమాషా ప్రకారం రిజ్వేషన్లు అమ లు చేయాలన్నారు. సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని, ఆ రోజున సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పోడు భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలని నినాదాలు చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. అప్పటికే మోహరించిన పోలీసులు వారిని అడ్డుకునేందుకు యత్నించారు. ఇరువర్గాల మధ్య తోపులాట చోటు చేసుకుంది. కొంతమంది క్యాంపు కార్యాలయంలోకి వెళ్లేందుకు యత్నించారు. వారిని నిలువరించేందుకు పోలీస్ వ్యాన్‌లలో ఎక్కించారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అందుపులోకి తీసుకున్న గిరిజన సంఘాల నాయకులను పిఎస్‌లకు తరలించారు.




హైదరాబాద్ వార్త


# న్యూఇయర్ వేడుకలపై పోలీసుల ఆంక్షలు

**పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు, ఫ్లైఓవర్ల మూసివేత**

**హంగామా సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**

**ప్రత్యేక బృందాలతో పోలీస్, ఎక్సైజ్‌శాఖలు నిఘా**

**రాత్రి ఒంటిగంట వరకు అందుబాటులో మెట్రో సేవలు**



హైదరాబాద్, డిసెంబరు 30, ప్రభాతవార్త: పాత సంవత్సరానికి వీడ్కోలు పలికి, కొత్తసంవత్సరానికి ఆహ్వానం పలికే న్యూఇయర్ వేడుకలపై పోలీసులు నజర్ వేశారు. వేడుకల సందర్భంగా రెచ్చిపోయే యువతకు బ్రేకులు వేసేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. నగరంలోని మూడు కమీషనరేట్ల పరిధిలో వేడుకలు జోష్‌గా జరిగే అవకాశం ఉండటంతో ఉన్నతాధికారులు అన్నిపోలీస్ స్టేషన్‌లకు ఆదేశాలు జారీ చేశారు. వేడుకల్లో శృతిమించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండేం దుకు తీసుకోవాల్సి న జాగ్రత్తలను ఎలా పాటించాలనే దానిపై సిబ్బందికి సూచించారు. ట్రాఫిక్ సివిల్, పోలీసులతోటు, ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు అలాగే ఇతర విభాగాలకు చెందిన పోలీస్ బలగాలను రంగం లోకి దింపారు. పోలీస్‌స్టేషన్ల వారిగా ఏప ప్రాంతాల్లో వేడుకలు జరగుతు న్నాయి. వాటికి ఎంతమంది హాజరయ్యే అవకాశం ఉంది. అక్కడ నిర్వ హించే కార్యక్రమాల వివరాలను పూర్తిగా సేకరించారు. వేడుకల సంద ర్భంగా నిషేదిత మాదక ద్రవ్యాలు వాడే అవకాశం ఉండటంతో ఈఅం శాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా నిషేదిత మాదకద్రవ్యాలు సప్లై చేయడం, వాటిని వాడటం వంటివి గుర్తి స్తే కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేయనున్నారు. మత్తెక్కించే మద్యం, శరీరం మొత్తం షేక్ చేసి మ్యూజిక్‌ల నడుమ యువత వేడుకల్లో శృతిమించితే ఊరుకోబోమని హెచ్చరిస్తున్నారు. న్యూఇయర్ వేడుకల నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవంటున్నారు.

**నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు..** నిబంధనల ప్రకారం రాత్రి 8గంటల నుండి అర్థరాత్రి ఒంటిగంట వరకు పూర్తి చేయాల్సి ఉంటుంది. డీజే సౌండ్స్‌తో ఇతరులకు ఇబ్బందులు కలిగించే పనులు చేయరాదు. శబ్దం 45డెబిల్స్ దాటకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వేడుకల్లో భాగంగా బాణాసంచా కాల్చడం నిషేదం. వేడుకలు ప్రారంభం నుండి పూర్తి అయ్యే వరకు వీడియోలు చిత్రీకరించి వాటిని 1,2 తేదీల్లోపు కమీషనరేట్స్‌లో అప్పగించాలి. ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకున్నా నిర్వాహకులే బాధ్యులు అవుతారని దీనిని దృష్టితో ఉంచుకుని వేడుకలు నిర్వహించుకోవాలని సూచిస్తున్నారు. అంతేకాకుండా నగరంలోని అన్ని రోడ్లపై డ్రంకెన్‌డ్రైవ్‌లు నిర్వహించనున్నారు. చిత్తుగా తాగి డ్రైవింగ్ చేసేవారిపై కేసులు నమోదు చేసి వాహనాలు స్వాధీనం చేసుకుంటామని పోలీసులు తెలుపుతున్నారు. జూబ్లీహిల్స్‌లోని పబ్‌లలో రాత్రి 10 తర్వాత మ్యూజిక్ పెట్టొద్దని స్పష్టం చేసింది. గతంతో ఇచ్చిన ఉత్తర్వులు సవరించాలని పబ్‌ల అభ్యర్థనను తోసి పుచ్చింది. గతంలో విధించిన ఆంక్షలు యథాతథంగా కొనసాగుతాయని హైకోర్టు స్పష్టం చేసింది.

**ట్రాఫిక్ ఆంక్షలు.. ఫ్లైఓవర్‌ల మూసివేత..** న్యూఇయర్ వేడుకల సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనుచోటు చేసుకోకుండా నగరమంతా డ్రంకెన్‌డ్రైవ్‌లు నిర్వహించనున్నటు తెలిపారు. ట్యాంక్‌బండ్, నక్లెస్‌రోడ్, ఎన్టీఆర్‌మార్గ్‌లతోపాటు నగరంలోని అన్ని ఫ్లైఓవర్‌లను మూసివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈఆంక్షలు 31(శనివారం) రాత్రి 10గంటల నుండి జనవరి 1 (ఆదివారం) తెల్లవారుజామున 2గంటల వరకు ఉంటాయని తెలిపారు.

**వాహనాల అనుమతి లేని ప్రాంతాలు..** ఖైరతాబాద్ నుండి ఎన్టీఆర్‌మార్గ్, నెక్లెస్‌రోడ్ వైపు ట్రాఫిక్ అనుమతించరు. వాటిని ఖైరతాబాద్ రాజ్ భవన్‌వైపు దారి మళ్లిస్తారు. బీఆర్‌కే భవన్ నుండి ఎన్టీఆర్ మార్గ్‌కు అనుమతిలేదు.. వాటిని ఎగ్బాల్ మినార్ నుండి లక్డీకాపూల్ వైపు దారి మళ్లిస్తారు. లిబర్టీ నుండి ట్యాంక్ బండ్ వచ్చేవాహనాలను జీహెచ్ ఎంసీ ఆఫీస్ వైజంక్షన్, బిఆర్‌కే భవన్, తెలుగుతల్లి ఫ్లైఓవర్, ఎక్బాల్ మినార్, నుండి రవీంద్ర భారతి వైపు దారి మళ్లిస్తారు. ఖైరతాబాద్ మార్కెట్ నుండి నక్లెస్ రోడ్‌కు ట్రాఫిక్ అనుమతించరు. మింట్ కాంపౌండ్ నుండి సచివాలయం వైపు వెళ్లేమార్గాన్ని మూసి ఉంచుతారు. నల్లగుట్ట రైల్వే బ్రిడ్జ్ నుండి సంజీవయ్యపార్క్‌కు అనుమతించరు. వాటిని సైక్లింగ్ క్లబ్ నుండి కవాడిగూడ వైపు దారి మళ్లిస్తారు.

**సైబరాబాద్, కమిషనరేట్ పరిధిలో..** ఓఆర్ఆర్‌పై రాత్రి 10గంటల నుంచి తెల్లవారుజాము 5గంటల వరకు విమానాశ్రయానికి వెళ్లే వాహనాలు తప్ప ఇతర వాహనాలకు అనుమతి ఉండదు. పివి. నర్సింహ్మారావు ఎక్స్‌ప్రెస్‌వే ఫ్లైఓవర్ పైనా నిబంధనలను అమల్లో ఉంటాయి. గచ్చిబౌలి శిల్లాలేవుట్ ఫ్లైఓవర్, గచ్చిబౌలి ఫ్లైఓవర్, బయోడౌఐవర్సిటీ పార్క్ ఫ్లైఓవర్ 1,2 షేక్‌పేట్ ఫ్లైఓర్, మైండ్ స్పేస్ ఫ్లైఓవర్, రోడ్ నం.45ఫ్లైఓవర్, దుర్గం చెరువు తీగల వంతెన, సైబర్ టవర్ ఫ్లైఓవర్, ఫోరం మాల్ ఫ్లైఓర్, జేఎన్‌టియు ఫ్లైఓర్, కైత్లాపూర్‌పై వంతెన, బాలానగర్ బాబు జగ్జీవన్‌రామ్ ఫ్లైఓవర్‌ల పైకి ఆ సమయంలో వాహనాలు అనుమతించరు. అలాగే క్యాబ్, ట్యాక్సీలు, ఆటో డ్రైవర్లు, ప్రజలను ప్రయాణికులను నిరాకరించకూడదని పోలీసులు సూచించారు. నిరాకరించే డ్రైవర్లు వాహనాల నంబర్, సమయం వివరాలతో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు.

**రాత్రి 1గంట వరకు మెట్రో సేవలు..** నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని నగర ప్రజలకు సౌకర్యవంతమైన, సురక్షితంగా ప్రయాణించేందుకుగానూ మెట్రోరైల్ సమయాన్ని పొడిగిస్తున్నట్లు హైదరాబాద్ మెట్రోరైల్ ఎండీ ఎన్‌వీఎస్‌రెడ్డి ప్రకటించారు. డిసెంబర్ 31న అర్ధరాత్రి 1గంట వరకు మెట్రోరైళుల నడపనున్నట్లు తెలిపారు. ప్రారంభ స్టేషన్ నుంచి చివరి మెట్రోరైల్ రాత్రి 1గంటల వరకు బయలుదేరి.. 2గంటలకు ఆఖరి స్టేషన్‌కు చేరుతుం దని స్పష్టం చేశారు. మెట్రో రైళ్లలో, స్టేషన్‌లలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు ఆస్కారం లేకుండా మెట్రో పోలీసులు, సెక్యూరిటీ అధికారులు పూర్తి భద్రత చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. ప్రయాణికులు మెట్రో అధికారులకు సహకరించాలని కోరారు.

## ప్రధాని మోడీ మాతృమూర్తికి ఘన నివాళులు



**నార్సింగిలో ప్రధాని నరేంద్రమోడీ మాతృమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు**

నార్సింగి, డిసెంబర్ 30 ప్రభాతవార్త : గండిపేట్ మండలంలోని నార్సింగి చౌరస్తాలో భారత ప్రధాని నరేంద్రమోడీ మాతృమూర్తికి బీజేపీ నాయకులు ఘన నివాళులు అర్పించారు. బీజేపీ అధ్యక్షులు చిక్కిరి బిక్షపతి యాదవ్ ఆధ్వర్యంలో నాయకులంతా ప్రధాని తల్లి హీరాబెన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు దుద్దాల లక్ష్మీనారాయణ, బిక్షపతి యాదవ్‌లు మాట్లాడుతూ అభినవ శివాజీని భారతావనికి అందించిన మాతృమూర్తి, మరో జిజియాభాయి హీరాబెన్ అని కొనియాడారు. కొడుకు నరేంద్రమోడీ ముఖ్యమంత్రి అయినా, ప్రధాన మంత్రి అయినా ఆయన పరువుకు భంగం వాటిల్లేలా ఏనాడు ప్రవర్తించలేదన్నారు. నిండు నూరేళ్ల సనాతన ధర్మాన్ని ఆచరిస్తూ, ఇతరులకు ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడిపారని తెలిపారు. భారతదేశం అస్థిత్వాన్ని కాపాడే, పెంచే యోధుడుని అందించిన హీరాబెన్ సంపూర్ణ జీవితంను అనుభవించారని పేర్కొన్నారు. ఒక్క భారత దేశమే కాకుండా యావత్ ప్రపంచమే ఆదరించే, గౌరవించేలా నరేంద్ర మోడీని తీర్చిదిద్దిన ఘనత హీరాబెన్‌కే దక్కుతుందన్నారు. భారత ప్రధాన మంత్రి తల్లి చనిపోయినా ఎలాంటి హంగు ఆర్భాటాలు లేకుండా, అతి సాధారణ పౌరుల వలే అంత్యక్రియలు జరుపడం నరేంద్రుడికే చెల్లిందన్నారు. నేటి మహిళలు అంతా తమ పుత్రులను దేశం, ధర్మం రక్షణ కోసం పాటు పడేలా తమ బిడ్డలను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జైపాల్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్, గోవిందిగారి శివరాజ్, శేఖరప్ప, శంకర్‌సంగ్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## లాలాపేట్‌లో ప్లంబర్ హత్య



**హత్యకు గురైన పాండు (పాతచిత్రం)**

తార్నాక, డిసెంబర్ 30 ప్రభాత వార్త: ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్న ఓ వ్యక్తిని గుర్తు తెలియని దుండగులు ధారుణ హత్యచేసి పారిపోయారు. ఈ సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్‌పెక్టర్ రమేష్ నాయక్ కథనం ప్రకారం. లాలా పేట్ వినోభానగర్‌కు చెందిన కీర్తి పాండు (50) స్థానికంగా ప్లంబర్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇదిలా ఉండగా భార్య మరణించడంతో ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. తరుచు తన స్నేహితులతో కలసి ఇంట్లో రాత్రి సమయాల్లో మద్యం సేవించేవాడని స్థానికులు పేర్కొన్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం మృతుడి ఇంటి ఎదురుగా ఉండే వారు ఇతని ఇంటికి వచ్చారు. రక్తపు మడుగులో పడి మృతి చెందిన పాండును చూసి వారు ఆందోళనకు గురై పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని స్థానికంగా విచారించి మృత దేహాన్ని గాంధీకి తరలించారు. కత్తితో పొడిచి హత్య చేసిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయని ఏసీపి ఆకుల శ్రీనివాస్, ఇన్స్‌పెక్టర్ రమేష్ నాయక్ పేర్కొన్నారు. తన స్నేహితులతో కలిసి మద్యం సేవించిన క్రమంలో గొడవ జరుగడంతో మాటా మాటా పెరిగి అతనిని హత్య చేశారా మరే కారణాలతో హత్య చేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## హీరో షోరూమ్ యజమాని కిడ్నాప్ కేసులో డ్రైవర్ అరెస్ట్

చార్మినార్, డిసెంబరు 30 ప్రభాతవార్త : హీరో షోరూం యజమానిని కిడ్నాప్ చేసి భారీ మొత్తంలో నగదు దోచుకుందామని ప్రయత్నించిన డ్రైవర్‌ను రాజేంద్రనగర్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శంషాబాద్ డిసిపి జగదీశ్వర్‌రెడ్డి శనివారం రాజేంద్రనగర్ ఎసిపి కార్యాయలంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్ ప్రాంతానికి చెందిన సాయి కిరణ్‌రెడ్డి గచ్చిబౌలిలో హీరో షోరూమ్‌ను నిర్వహిస్తున్నాడు. ఇతని వద్ద డ్రైవర్‌గా పని చేస్తున్న సుదర్శన్‌పై గతంలో రాయదుర్గం, గజ్వేల్, మహంకాళీ పోలీస్ స్టేషన్ల పరిధులలో దొంగతనాలకు పాల్పడిన చరిత్ర ఉంది. కాగా డ్రైవర్ సుద ర్శన్ యజమాని అయిన సాయి కిరణ్‌రెడ్డిని కిడ్నాప్ చేసి భారీ మొత్తంలో డబ్బును దోచుకుందామని తన ముగ్గురు స్నేహితులతో కలిసి పథకం వేశాడు. 27వ తేదీన యజమాని సాయికిరణ్‌రెడ్డిని కారులో గచ్చిబౌలికి తీసుకెళ్తూ రాజేంద్రనగర్ పత్తికొండ వద్ద మూత్ర విసర్జన కోసం డ్రైవర్ సుద ర్శన్ దిగాడు. అదే సమయంలో అక్కడ ఉన్న డ్రైవర్ సుదర్శన్ స్నేహితులైన అర్జున్, అనిల్, విజయ్‌లు, కలిసి సాయి రెడ్డిని కిడ్నాప్ చేయటానికి ప్రయ త్నించారు. సాయి కుమార్ రెడ్డి వారితో తోపులాడి తప్పించుకున్నాడు. ఈ కేసులో రాజేంద్రనగర్ పోలీసులు డ్రైవర్ సుదర్శన్ అదుపులోకి తీసుకున్నారు. సుదర్శన్‌పై పీడియాక్టు నమోదు చేసినట్లు డిసిపి జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు.

# ఘనంగా అయ్యప్ప స్వామి దేవస్థానం 31వ వార్షికోత్సవం



**వార్షికోత్సవ వేడుకలు ముస్తాబైన అయ్యప్ప స్వామి ఆలయం**

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 30, ప్రభాతవార్త : కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వివేకానంద నగర్ కాలనీలో గల శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానం వారి 31వ వార్షికోత్సవ పూజా మహోత్సవ కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గత 30 సంవత్సరాల క్రిత ఇక్కడి శ్రీ అయ్యప్ప దేవస్థానాన్ని అప్పటి ఆలయ కమిటీ చైర్మన్ దివంగత నేత రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వడ్డేపల్లి నర్సింగరావు నిర్మించడం జరిగింది. స్థానికంగా ఏర్పాటు చేసిన శ్రీ అయ్యప్ప స్వామి ఆలయం కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి పరిసర ప్రాంత అయ్యప్ప భక్తులు ప్రతిరోజు ఉదయం సాయంత్రం వేళల్లో పూజ చేసుకునే అవకాశాన్ని కల్పించారు. అయితే అప్పట్లో అయ్యప్ప స్వాములు మదాలలు వేసుకునే స్వాముల సంఖ్య పెరగడంతో వడ్డేపల్లి నర్సింగరావు 1998 నుండి ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప స్వాముల కోసం అన్నసంతాపన కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాను రాను ఇక్కడి ఆలయ ప్రాంగణం ప్రతిరోజు ఉదయం సాయంత్రం వేళల్లో అయ్యప్ప స్వాముల కోరుకున్న వరాలు తీర్చే అయ్యప్ప స్వామిగా విరాజిల్లుతూ వస్తున్నాడు.

**ప్రారంభమైన వార్షికోత్స వేడుకలు..** ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పూజా కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా ఆలయ కమిటీ చైర్మన్ వడ్డేపల్లి రాజేశ్వరరావు యామిని దంపతులు కుటుంబ సమేతంగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం 4గంటల నుండి లక్ష్మీ గణపతి హోమం, గోపూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నక్షత్ర కళాశాభిషేకం అలంకరణ తదితర కార్యక్రమాలు జరిగాయి. అలాగే సాయంత్రం సంధ్యార్చన శ్రీ అయ్యప్ప స్వామి ఉత్సవమూర్తికి ఏనుగు అంబానీపై పెద్ద ఎత్తున ఊరేగింపు మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అఖిల భాతర అయ్యప్ప సేవా సమితి ప్రధాన కార్యదర్శి తరుణ్‌గురుస్వామి హాజరయ్యారు. సాయం త్రం 7గంటల నుండి ఆలయ ప్రాంగణంలో మహా పడిపూజ భజన కార్యక్రమంలో అనంతరం హరివరాసనం నిర్వహించారు. నేడు లక్ష్మీ గణపతి హోమం పద్దెనిమిది కళశములతో మహాపడిపూజ మద్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 5:30 సంధ్యార్చన రాత్రి 9గంటలకు శ్రీ అయ్యప్ప స్వామి వారికి పుష్పాభిషేకం అలాగే 12 గంటలకు నూతన ఆంగ్ల సంవత్సర ప్రవేశ సందర్భంగా అయ్యప్ప స్వామి వారికి ప్రత్యేక దర్శనం హారతి కార్యక్రమాలు జరుగుతాయి.




## నూతన సంవత్సరానికి భద్రతా ఏర్పాట్లు

ఖైరతాబాద్, డిసెంబరు 30 ప్రభాతవార్త: ప్రజలు మంచి వాతావరణంలో స్వేచ్ఛగా జీవించాలని భగవంతులను కోరుతూ ప్రజానీకం కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు సర్వం సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే స్థానికంగా ఉన్నటువంటి దేవాలయాలు కూడా అందుకు సిద్ధమయ్యాయి. కుటుంబ సమేతంగా వచ్చి పూజించుకుని ఆయురారోగ్యాలు తదితర వంటివి బాగుండాలని భగంతులను పూజించనున్నారు. ఇలా కొందరు దేవాలయాలకు వెళ్లగా మరికొందరు సొంత ఊళ్లకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. కొత్త సంవత్సరం నుంచి అంతా మంచే జర గాలని వారు కోరుకుంటున్నారు. మరోవైపున ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అందరూ బాగుండా లనే తపనతో అవసరమైన బందోబస్తును సెంట్రల్ జోన్ డిసిపి నేతృత్వంలో సైఫాబాద్ డివిజన్ ఎసిపి, ఇన్స్‌పెక్టర్‌లు, ఎస్ఐలు సిబ్బందితో అంతా సిద్ధమయ్యారు.

## ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి



కార్ఖానాలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీగణేష్

కంటోన్మెంట్,డిసెంబర్ 30 ప్రభాతవార్త: ప్రజలు ఎల్లప్పుడు ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో జీవించాలని కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త ఎన్.శ్రీగణేష్ తెలిపారు. విభిన్న మతాలతో వేర్వేర్‌గా రూపొందించిన 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం కార్ఖానలోని మహంకాళి దేవాలయంలో, మజీద్,మట్‌పోర్ట్‌లోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు, పూజలు నిర్వహించి నూతన సంవత ్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని మహంకాళి దేవాలయం అమ్మవారిని,కార్ఖానలోని మజీద్‌లోఖురాన్‌ను, మట్‌పోర్ట్‌లోని చర్చిలో యేసుక్రీస్తును అరాధించి ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేసి భగవంతున్ని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, శ్రీగణేష్ యువసేన ప్రతినిధులు పాల్గొన్నారు.

## మర్రిని కలిసిన సనత్‌నగర్ బిజెపి నేతలు



బేగంపేట డిసెంబరు 30,ప్రభాతవార్త : సనత్‌నగర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధరరెడ్డి భాజపాలో చేరారు. ఆయన భాజపాలో చేరిన అనంతరం సనత్‌నగర్ నియోజకవర్గం భాజపా సీనియర్ నేతలు శుక్రవారం బేగంపేట లోని మర్రి కార్యాలయంలో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసారు.తమ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల సందర్భంగా సనత్‌నగర్ నియోజకవర్గంతో పాటు నగరంలోని అన్ని స్థానాల్లో భాజపా విజయం సాధించేలా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించాలని వారు నిర్ణయించారు.ఈ సందర్భంగా టీఆర్ఎస్ ప్రభుత్వం పై ప్రజలలో పెరుగుతున్న వ్యతిరేకతను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు గల్లీ గల్లీలో పార్టీ పటిష్టతకు ప్రయత్నించాలని వారు నిర్ణయించారు. అధికార పార్టీ నేతల అవినీతిని ప్రజల్లోకి బలంగా తీసికెళ్లాలని, బూత్‌స్థాయిలో ఉన్న పార్టీ క్యాడర్‌ను మరింత పటిష్టం చేయాలని నిర్ణయించారు.ఈ ఆత్మీయ భేటీలో సీనియర్ బీజేపి పరివార్ నాయకులు జైహింద్ గౌడ్,ఆకూరి శ్రీనివాస రావు, రాజుగౌడ్, బంటి, పొలిమేర సంతోష్,ఉమా, సుధాకర్,మిథుల్‌రాజ్,వారణాసి,కార్తీక్,సరితాగౌడ్,ప్రవీణ్‌గౌడ్,శ్రీనివాస్,మల్లిఖార్జున్,ప్రశాంత్,కె.లక్ష్మణ్,నందు,సందీప్‌వర్మ,సురేశ్రావల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయులపైనే ఆధారపడి ఉంది



మాట్లాడుతున్న విజయలక్ష్మి. చిత్రంలో మహాలక్ష్మీరామన్‌గౌడ్

సైఫాబాద్, డిసెంబరు 30 ప్రభాతవార్త: విద్యార్థుల భవిష్యత్తు తరగతి గదుల్లో ఉపాధ్యాయుల భోదనపైనే ఆధారపడి ఉంటుందని హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్, డిఇఒ ఎం.విజయలక్ష్మి చెప్పారు. డివిజన్‌లోని ముత్యాలబాగ్‌లో గల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో తొలిమెట్టు కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా వారు మాట్లాడారు. ఉపాధ్యాయులు తొలిమెట్టు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిఐఓఎస్ లక్ష్మణ్, ప్రిన్సిపల్ పి.ప్రసాద్, హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, దుర్గారాణి, సౌజన్య, అఫ్రిన్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

సైఫాబాద్, డిసెంబరు 30 ప్రభాతవార్త: కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎబివిపికి చెందిన ఆనేక మంది విద్యార్థులు శుక్రవారం ప్రిన్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఎబివిపి నాయకులు శ్రావణ్, హర్ష, అజయ్ తదిరులు మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో ఆనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**తెలంగాణ ప్రజల పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎం.మురళీధర్ గుప్తా**



రైతు దీక్షలో ప్రసంగిస్తున్న మురళీధర్ గుప్తా

ధర్నాచౌక్, డిసెంబర్ 30, ప్రభాతవార్త: ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమ లు చేయాలని తెలంగాణ ప్రజల పార్టీ రాష్ట్ర అధ్య క్షులు ఎం.మురళీధర్ గుప్తా డిమాండ్ చేశారు. గురువారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ ప్రజల పార్టీ, తెలంగాణ రైతు సంక్షేమ సమితి సంయుక్త ఆధ్వర్యంలో రైతు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు ఉచితంగా ఎరువులు పంపిణీ చేస్తానని చెప్పారు కానీ ఆ హామీ అమలుకు నోచుకోలేదని, తక్షణమే రాష్ట్రంలో ఉన్న 55 లక్షల మంది రైతులకు ఉచితంగా ఎరువులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. 2018 అక్టో బర్‌లో హామీ ఇచ్చిన ప్రకారం లక్షరూపాయల రుణమాఫీ ఏకకాలంలో చేయాలని అన్నారు. పేద రైతులకు ఉచితంగా డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. రైతు సంక్షేమం కోసం తెలంగాణ ప్రజల పార్టీ నిరంతరం పోరాడుతుందని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రజల పార్టీ ఎజెండా ప్రధానంగా రైతులు, నిరుద్యోగ యువత సమస్యల పరిష్కారమని తెలిపారు. ఈ దీక్షా కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఇంద్ర సేన, మహిళా కార్యదర్శి విజయలక్ష్మి, నాయకులు రఘునాథ్, సూర్యనారాయణ, రవి, మహేందర్, జబ్బర్, రాజు, రైతు నాయకులు లింగంగౌడ్, రాంరెడ్డి, కమలాకర్‌రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## బైరి నరేష్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి : మల్లేష్‌యాదవ్



అయ్యప్పమాలధారులతో కలిసి దుండిగల్ పిఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న మల్లేష్‌యాదవ్

దుండిగల్, డిసెంబర్ 30 ప్రభాతవార్త : అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌ను వెంటనే అరెస్ట్ చేసి పిడి యాక్ట్ నమోదు చేయాలని అయ్యప్పమాల ధారులతో కలిసి బిజెపి మండల అధ్యక్షులు మల్లేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈమేరకు దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఆయన గండిమైసమ్మ చౌరాస్తాలో ధర్నా నిర్వహించారు. ఈసం దర్భంగా మల్లేష్‌యాదవ్ మాట్లాడుతూ మహోన్నత చరిత గల అయ్యప్పస్వామిని కోట్లాది భక్తులు ఆరాధిస్తూ మాలధారణ స్వీకరిస్తారన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా అయ్యప్పస్వామిపై నోటికి వచ్చినట్లు మాట్లాడిన దుర్మార్గుడు బైరి నరేష్‌ను వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. కులమతాలను రెచ్చగొడుతూ సమాజంలో అహింసను సృష్టించేందుకు ప్రయత్నిస్తున్న ఇటువంటి వారిని సంఘవిద్రోహశక్తుల గుర్తించి అతని పై పిడి యాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పిసరి క్రిష్ణారెడ్డి, విజయ్, అతీష్‌బాబు, అనిల్, అయ్యప్పమాలధారులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు

చిక్కడపల్లి, డిసెంబరు 30 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ఇంజనీరింగ్ శాఖ మెయింటెనెన్స్, ప్రాజెక్ట్స్‌లలో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలు ఒకటోతేదీన జీతాలు వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్, మెయింటెనెన్స్, ప్రాజెక్టు ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి సమావేశం ప్రభుత్వాన్ని కోరింది. గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన అసోసియేషన్ రాష్ట్ర స్థాయి సమావేశంలో నూతన సంవత్సరం డైరీ-2023, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.నారాయణ, ప్రధాన కార్యదర్శి జి.వెంకటరెడ్డితో పాటు షేక్ మహ్మద్, సిఐటియు రాష్ట్ర నాయకులు కె.వెంకట్రామయ్య, భూపాల్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ముఖ్య నాయకులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్‌లకు జేటీఓలుగా పదోన్నతుల గురించి ఈఎన్‌సితో చర్చించడం జరిగిందని, నూతన సంవత్సరంలో ఇస్తామని హామీ ఇచ్చినట్లు నేతలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల సాధన కోసం పెద్దఎత్తున ఆందోళన చేయాలని సమావేశం నిర్ణయించింది.

## కార్మికుల డిమాండ్లను భద్రత కోడ్ రూల్స్‌లో చేర్చాలి

చిక్కడపల్లి, డిసెంబరు 30 ప్రభాతవార్త: రాష్ట్రంలో అసంఘటితరంగంలో పనిచేసే వారిని కార్మికులుగా గుర్తించి వారిని నమోదు చేసుకోవాలని తెలంగాణ వ్యవసాయవృత్తిదారుల యూనియన్, నేషన్ అలయెన్స్ ఆఫ్ అగ్రికల్చర్ అలైడ్ వర్కర్స్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో అసంఘటితరంగంలో పనిచేస్తున్న కార్మికుల సామాజిక భద్రతకు సంబంధించిన 5 ప్రధాన డిమాండ్లను సామాజిక భద్రత కోడ్ రూల్స్‌లో చేర్చాలని రాష్ట్ర సదస్సు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మట్టగళ్ళ వెంకటయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో తెలంగాణ వ్యవసాయ ఉద్దీపన యూనియన్ నేత ప్రభుదాస్, దళిత బహుజన ఫ్రంట్ కార్యదర్శి శంకర్, ఎంఏకెఏఎం నుంచి ఆశాలత, ఎన్ఏఎస్‌విఐ నుంచి లక్ష్మణ్, గట్టు రాముడు, దళిత సర్పంచ్ కె.వెంకన్న తదితర నేతలుపాల్గొన్నారు. సమావేశం అనంతరం సామాజిక భద్రత కోడ్ పుస్తకాన్ని ఎన్ఏఎడబ్ల్యుయు జాతీయ కార్యదర్శి పోగురు చిన్నయ్య ఆవిష్కరించారు.

## హీరాబెన్ చిత్రపటానికి నివాళులు



హీరా బెన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పిస్తున్న కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్

బేగంబజార్,డిసెంబర్ 30ప్రభాతవార్త: దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడి తల్లి హీరా బెన్ మృతి పట్ల జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొ రేటర్ రాకేష్ జైస్వాల్ విచారం వ్యక్తం చేశారు. శుక్రవారం జాంబాగ్ డివిజన్ బిజెపి ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నరేంద్రమోడి తల్లి హీరాబెన్ చిత్రపటా నికి పూలమాల వేసి రాకేష్ జైస్వాల్ నివాళ్లు అర్పించారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు అనిల్‌కుమార్‌యాదవ్,మయూర్,శ్రీనివాస్, రామకృష్ణ, విద్యాషిండే,కల్పన, సంగీత,సురేష్, సాయిరామ,రోషన్,రవి,రేణుక పాల్గొన్నారు.

## మాదిగలను మోసం చేసే పార్టీలకు గుణపాఠం చెబుతాం

చిక్కడపల్లి, డిసెంబరు 30 ప్రభాతవార్త: త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా 'మాదిగ చైతన్య పాదయాత్ర' చేసి మాదిగ సమాజాన్ని మేలుకొల్పి రాజకీయ పార్టీలకు తగిన బుద్ధిచెబుతామని తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి అధినేత గాదె వెంకటేశ్ మాదిగ హెచ్చరించారు. బాగ్‌లింగంపల్లిలోని తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యాలయ ప్రారంభోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధికార ప్రతినిధి ఇంజం సంబన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెంకటేశ్ మాదిగ మాట్లాడుతూ మాదిగలను మోసం చేసే పార్టీలకు రాజకీయంగా సమాధి చేస్తామని, మాదిగలకు మేలు చేసే పార్టీలకు అండగా ఉంటామని తెలిపారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఈ యాత్ర చేసి మాదిగ జాతిని మేలుకొలుపుతామని, రాజకీయ పార్టీలకు బుద్ధి చెబుతామని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులుగా ఎర్ర రాంచందర్ మాదిగను నియమించారు. రాష్ట్ర అధికారప్రతినిధిగా ఇంజం సంబన్న మాదిగ, రాష్ట్ర మీడియా అధ్యక్షులుగా మాదింరే నర్సింగరావులను నియమించారు.

## అర్ధాంతరంగా నిలిచిపోయిన కమ్యూనిటీ హాలు నిర్మాణం

**ఎరుకల బస్తీలో ఐదేళ్లు అవుతున్నా పట్టించుకోవడంలేదంటూ స్థానికుల ఆందోళన**

**అసంపూర్తిగా నిల్చిపోయిన నిర్మాణాన్ని పరిశీలించిన బిజెపి నేతలు**




ఎరుకల బస్తీలో అసంపూర్తిగా నిలిచిపోయిన కమ్యూనిటీ హాలు నిర్మాణం

బేగంపేట డిసెంబరు 30, ప్రభాతవార్త : బేగంపేట డివిజన్‌లో అధికార పార్టీ నేతలు అభివృద్ధిని విస్మరించారని,డివిజన్ పరిధిలోని ఎరుకల బస్తీలో ఐదేళ్ల క్రితం ప్రారంభించిన కమ్యూనిటీ హాలు నిర్మాణం అర్ధాంతరంగా నిల్చిపోయిందని, దీంతో స్థానికులు ఎలాంటి సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నారని బేగంపేట డివిజన్ నుంచి భాజపా తరుపున పోటీ చేసిన అభ్యర్థి రాజ్యలక్ష్మి ఆనంద్, మేడ్చల్ జిల్లా భాజపా మాజీ ఉపాధ్యక్షులు నెమలి ఆనంద్‌లు విమర్శించారు.శుక్రవారం ఎరుకల బస్తీలో అసంపూర్తిగా నిల్చిపోయిన కమ్యూనిటీ హాలు నిర్మాణాన్ని వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ డివిజన్ ప్రజల ఓట్లతో విజయం సాధించిన కార్పొరేటర్ డివిజన్‌లో అభివృద్ధిని విస్మరించారని, కమ్యూనిటీ హాలు అసంపూర్తిగా నిల్చిపోయిన విషయాన్ని స్థానికులు పలుమార్లు ఆమెకు విన్నవించినా స్పందించకపోవడం దారుణమన్నారు. అధికార పార్టీ నేతలు ఎన్నికల ముందు తమను గెలిపిస్తే డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామంటూ బూటకపు మాటలు చెప్పి ఓట్లేయించుకున్నారని, ఆ తరువాత డివిజన్‌లో అభివృద్ధిని పట్టించుకోవడం లేదని,వారు ఆరోపించారు. 2017వ సంవత్సరం ఆగస్టు నెల 3వ తేదీన ఎరుకల బస్తీలో సుమారు రూ 10 లక్షల రూపాయలతో కమ్యూనిటీ హాలు నిర్మాణం ప్రారంభించారని, స్లాబు వేసారని, అప్పటి నుంచి భవనం అసంపూర్తిగానే ఉందని, ఇప్పటికీ పూర్తి చేయలేదని, ఇంకెన్నాళ్లకు పూర్తి చేస్తారని వారు ప్రశ్నించారు.

## సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ భోగిశ్వర్లు

దుండిగల్, డిసెంబర్ 30 ప్రభాతవార్త: దుండిగల్ మున్సిపాలిటీ సమావేశ మందిరంలో శుక్రవారం సాధారణ సర్వ సభ్యసమావేశం సాదాసీదాగా జరిగింది. చైర్‌పర్సన్ క్రిష్ణవేణి క్రిష్ణ అధ్యక్షతన జరిగి న ఈసమావేశంలో ముందస్తు బడ్జెట్ 2023-24 గురించి చర్చించారు. జంతువుల సంరక్షణ కేంద్రం కోసం రూ,30లక్షల రూపాయలను కేటాయించారు. అంతకుముందు కౌన్సిలర్లు లేవనెత్తిన సమస్యలపై చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఆయా వార్డులలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశిం చారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పద్మారావు, కమీషనర్ భోగిశ్వర్లు, మేనేజర్ సునంద,ఏఈ ప్రవీణ్‌కుమార్, ఆర్‌వో శ్రీహరిరాజు, అకౌంటెంట్ రాజబాబు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామిపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండిపడ్డ భక్తులు

సంజీవరెడ్డి నగర్, డిసెంబర్ 30, ప్రభాతవార్త : హిందూ దేవుళ్ళపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన భైరి నరేష్‌పై భక్తులు తీవ్రంగా మండిపడుతున్నారు. భైరి నరేష్ చేసిన వ్యాఖ్యలకు శుక్రవారం శ్రీఎల్లమ్మ పోచమ్మ దేవస్థానం పాలకమండలి సభ్యులు ముచ్చర్ల ఆంజనేయులు యాదవ్ మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాటి మనుషుల భావాలకు ఏమాత్రం విలువనివ్వకుండా తామే మేధావులమని అనుకునే మూర్ఖులకు ఇలాంటి శాస్త్రి సరైనదని వాళ్ళు ఈ దాడి చేశారు కానీ సరైన చట్టాలు ఉండి వాటిరి సరిగ్గా అమలు చేసి నరేష్‌కు ఇంతకంటే కఠినమైన శిక్షను వేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి అపరిపక్వ మేధావులు కొంతమంది తమకే మొత్తం తెలుసుననీ ఇంతరులకు ఏమి తెలువదనే పొగరుత ఓ ఎదుటివారి అభిప్రా యాలకు విలువ ఇవ్వకుండా తమలోని ఉగ్రభావాలు అందరిపై రుద్దే ప్రయత్నం చేస్తుంటారన్నారు.

## ఘనంగా సిక్కుల మత గురువు గురుగోబింద్‌సింగ్ 357వ జయంతి



గౌలిగూడ గురుద్వారాలో జరిగిన సిక్కు మత గురువు గురు గోబింద్ సింగ్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు గడ్డం ఆశీష్‌కుమార్‌యాదవ్

గోషామహల్, డిసెంబర్ 30 ప్రభాతవార్త: సిక్కుల మత గురువు గురుగోబింద్ సింగ్ 357వ జయంతోత్సవాలను పురస్కరించుకుని గౌలిగూడ సెంట్రల్ గురుద్వారా ఆద్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ యువ నాయకులు గడ్డం ఆశీష్‌కుమార్‌యాదవ్ పాల్గొన్ని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గుడ్ గవర్నెన్స్‌పై విద్యార్థులచే ప్రసంగం



సమావేశంలో మాట్లాడుతున్న కాంతారావు

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 30, ప్రభాతవార్త : భారతరత్న భారత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి 98వ జయంతిని పురస్కరించుకుని కూకట్‌పల్లి, లింగంపల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బిజెవైఎం ఆధర్వ్యంలో శుక్రవారం గుడ్ గవర్నెన్స్‌పై ఔత్సాహిక విద్యార్థులచే ప్రసంగ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి అసెంబ్లీ బిజెపి ఇంచార్జ్ మాధవరం కాంతారావు హాజరై ఉత్తమ ప్రసంగాన్ని అందించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రధానమంత్రిగా మన దేశానికి విశేష సేవలందించిన దేశభద్రతకు పటిష్టమైన పునాదులు వేసిన వాజపేయిలో ఓ గొప్ప కవి దాగూన్నరని, తన కవిత్వంతో తన విమర్శలతోనే ప్రశంసలు అందున్న కవికోవిధుడు, ఆయన కవితలు, ప్రసంగాలు నేటి యువతారిని స్ఫూర్తిని అందిస్తాయని అన్నారు. ఆ మహానేతకు ఈ వేదిక ద్వారా ఘనమైన నివాళులు అర్పిస్తున్నామని కాంతారావు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మూసాపేట డివిజన్ కార్పొరేటర్ మహేందర్, బిజెవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్, బిజెపి నేతుల శ్రీకర్‌రావు, వినోద్‌కుమార్‌గౌడ్, మనోహర్, శేఖర్‌గుప్తా, కుమార్‌యాదవ్, దకాయర్ రావు, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## హిందువుల మనోభావాలను కించపరిచిన నరేష్‌ను శిక్షించాలి




చార్మినార్ ఇన్‌స్పెక్టర్ గురునాయుడుకు వినతి అందజేస్తున్న బిజెపి నాయకులు

చార్మినార్, డిసెంబరు 30 ప్రభాతవార్త : హిందూ దేవుళ్లను కించ పరుస్తూ శ్రీ అయ్యప్ప స్వామి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా మాటాడిన బైరి నరేష్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ గోల్కొండ జిల్లా బిజెపి మహిళా అధ్యక్షురాలు నిత్య పారిక్, రాష్ట్ర బిజెపి కార్యదర్గ సభ్యులు చేతన్ సూరితో పాటు పలువురు బిజెపి మహిళా నాయకులు కలిసి శనివారం చార్మినార్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ గురునాయుడుకు ఫిర్యాదు చేశారు.ఈ కార్యక్రమంలో అనుమూల్ పద్మ,శిల్పాసంఘీ,పూనం తుల్సియాన్,సెల్జా,శ్రీ కాంత్, శ్రీనివాస్, సంతోష్, శివ, వివేక్ సంఘీ,దీపక్ సోనీ,వేద్ ప్రకాస్,ఆధిత్యతో పాటు పలువురు పాల్గొన్నారు. కాగా రెండు రోజుల క్రితం కొడంగల్ నియోజకవర్గంలో జరిగిన ఓ సభలో అయ్యప్ప స్వా ములను కించ పరిచేలా మాట్లాడిన నరేష్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లిలో అయ్యప్ప స్వామి భక్తులు నిరసన వ్యక్తం చేసిన అనంతరం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఈ కార్యక్రమంలో వివేక్ గురుస్వామి,సుంకరి జయ ప్రకాష్,నోముల రాము యాదవ్, అడికే శ్రీశైలం, బల్మూరి శ్రీనివాస్ సాగర్,కుమార్ ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ విషయమై టిపిసిసి కార్యనిర్వాహక కార్యదర్శి పర్వతాల రాజేందర్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి భక్తులు ఛత్రినాక పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ జిలానీకి ఫిర్యాదు చేశారు.

## విద్యామంత్రి సబితాఇంద్రారెడ్డిని కలిసిన గ్రంథాలయ ఉద్యోగులు

చిక్కడపల్లి, డిసెంబరు 30 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలోని వివిధ గ్రంథాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయం టిఎన్జీఓల సెంట్రల్ ఫోరం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శాగంటి అయోధ్య, కార్యదర్శి బొల్లం మహేందర్, కోశాధికారి వరప్రసాద్, సంయుక్త కార్యదర్శి సుఖేశ్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి నరేందర్‌లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డిని కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. త్వరలోనే గ్రంథాలయలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సమీక్షా సమావేశం నిర్వహించి ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు.

## అధ్వాన్నంగా ఉన్న రోడ్లకు మరమ్మత్తులు చేపట్టాలి : జక్కుల మహేశ్వర్‌రెడ్డి



అధ్వాన్నంగా ఉన్న రోడ్లను పర్యవేక్షిస్తున్న జక్కుల మహేశ్వర్ రెడ్డి, పాండు యాదవ్ తదితరులు

కంటోన్మెంట్,డిసెంబర్ 30 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే రహదారులన్నీ అధ్వాన్న స్థితికి చేరుకున్నాయని బోర్డు ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వాటి మరమ్మత్తులకు శ్రీకారం చుట్టాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం బోయిన్‌పల్లిలోని సెంటర్ పాయింట్ బాపూజీ నగర్ సౌజన్యకాలనీ పరిసర ప్రాంతాల్లో మాజీ బోర్డు సభ్యుడు పాండు యాదవ్‌తో కలిసి పర్యటించి రోడ్ల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

**జస్టిస్ గ్రంధి భవాని ప్రసాద్**



విద్యార్థులను అభినందిస్తున్న జస్టిస్ గ్రంధి భవాని ప్రసాద్

తార్నాక, డిసెంబర్ 30 ప్రభాతవార్త: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ భవాని ప్రసాద్ పేర్కొన్నారు. సారథి స్కూల్లో నిర్వహించిన క్రీడోత్సవాలకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాలమైన ప్రాంగణంలో సారథిస్కూల్లో పిల్లలకు చదువుతో పాటు క్రీడలు, వివిద సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం సంతోషకరమన్నారు. శారీరక శక్తి చేకూర్చే క్రీడలను యాజమాన్యం వారు ప్రోత్సహించడం అభినందనీయం అన్నారు. నేటి రోజుల్లో పిల్లలకు చదువు ఎంత ముఖ్యమో ఆటలు కూడా ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిద క్రీడా పోటీలతో పాటు మాస్ డ్రిల్, టార్చ్‌డ్రిల్, ఫైర్ డ్రిల్ వంటి పోటీలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సారథి సంస్థల వ్యవస్థాపకులైన సేవా పార్థ సారథి గురించి రచించిన గీతాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ స్వర్ణశ్రీ, ప్రిన్సిపల్ లక్ష్మిప్రసన్న, డైరెక్టర్ నీలం లాల్వాణి తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్, డిసెంబరు 30 ప్రభాతవార్త : విద్యుత్ మరమ్మతులు కారణంగా ఈ నెల 31వ తేదీ శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకు బహదూర్‌పుర,ఎంటకాలనీ, కిషన్‌బాగ్, మహమూద్‌నగర్ బస్తీలలో, మధ్యాహ్నం 1 నుంచి 2 గంటలు వరకు అన్సారీ రోడ్డు,దానిమ్మ గుడిసెలు,ఓవైసీ హిల్స్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు చార్మినార్ సిబిడి ఎడిఇ మహ్మద్ అఫ్జల్ తెలిపారు.



ప్రధాని మోడీ తల్లి హీరాబెన్ మృతిపట్ల సంతాపం వ్యక్తం చేస్తున్న ముషీరాబాద్ బాపూజీనగర్ బస్తీవాసులు

## ఆడపిల్లలకు వరంగా కల్యాణలక్ష్మీ షాదీముబారక్ : ప్రభుత్వవిప్ గాంధీ




లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ప్రభుత్వవిప్ గాంధీ

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 30, ప్రభాతవార్త : కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ లాంటి పథకాలు ఆడపిల్లలకు వరంగా మారాయని ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. శనివారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వివేకానంద నగర్, హైదర్‌గనర్, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి పార్ట్ డివిజన్‌ల పరిధిలోని పలువురికి కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకం ద్వారా మంజూరైన 60 మంది లబ్ధిదారులకు అరవై లక్షల ఆరువేల తొమ్మిది వదల అరవై రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను ప్రభుత్వవిప్ అరికెపూడి గాంధీ ఆయన నివాసంలో కార్పొరేటర్లు రోజాదేవి రంగారావు, దొడ్ల వెంకటేష్‌గౌడ్, నార్నె శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ రంగరావులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా లాంటి విప్కర పరిస్థితుల్లో కూడా పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కెసిఆర్ ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. నియోజకవర్గం పరిధిలోని పలువురికి కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకం కింద చెక్కులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతీఒక్కరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి, సమ్మారెడ్డి, లక్ష్మీనారాయణ, ఎ.శ్రీనివాస్‌యాదవ్, జి.పెద్ద భాస్కర్‌రావు, ఎన్.చంద్రకాంత్‌రావు, కాశినాథ్‌యాదవ్, ఇబ్రహీం, ఆంజనేయులు, రఘునాథ్, మోజేష్, సలీమ్, చంద్రమోహన్‌సాగర్, అష్రాఫ్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి నిరు పేదలకు వరం : ఎమ్మెల్యే మంచిరెడ్డి


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి

**తుర్కయంజాల్, డిసెంబరు 30 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ కోహెడకి చెందిన గత ఆరు నెలల బుడ్డా కిషన్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆర్థిక సహాయంకోసం నాయకులసహకారంతో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని సంప్రదించగా, ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధినుండి 60వేల రూపాయల మంజూరు చేయించి శుక్రవారం స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి తన క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో రైతు బంధు కోఆర్డినేటర్ కందాల బల్దేవరెడ్డి, బుడ్డా విజయబాబు, పల్లపు ఆంజనేయులు, గంగని శ్రీనివాస్, ఏర్పుల రమేష్, టిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆనంద్‌బాగ్ శ్రీవారి హుండీ లెక్కింపు


హుండీ లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది, అర్చకులు తదితరులు

**మల్కాజ్‌గిరి, డిసెంబరు 30 ప్రభాతవార్త:** మల్కాజ్‌గిరి ఆనంద్‌బాగ్ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వారికి భక్తులు హుండీలోసమర్పించిన కానుకలను శుక్రవారం ఎండోమెంట్ పర్యవేక్షణ అధికారి కె వెంకన్న సమక్షంలో లెక్కించగా రూ. 1,57,234 ఆదాయం వచ్చిందని ఇది ఆదాయమని ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎ.బిరవీంద్ర రెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపులో ప్రధాన అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు,అర్చకులు వెంకట రమణాచార్యులు, ఆలయ మాజీ చైర్మన్లు, మాజీ ధర్మకర్తలు, భక్తులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బైరి నరేష్‌పై పోలీసులకు ఫిర్యాదు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఉపేందర్ గుప్తా తదితరులు

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 30 ప్రభాతవార్త:** హిందూ దేవతలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్ పై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి జైల్లో పెట్టాలని బిజెపి సీనియర్ నాయకుడు, గురుస్వామి డాక్టర్ మొగుళ్ళపల్లి ఉపేందర్‌గుప్తా డిమాండ్ చేశారు. అయ్యప్ప స్వామి ఇతర దేవత మూర్తులపై ఇష్టం వచ్చినట్లు బైరి నరేష్ పదజాలం వాడడం పట్ల శుక్రవారం ఉపేంద్రగుప్తా ఆధ్వర్యంలో సరూర్ నగర్ పోలీసులకు వినతి పత్రాన్ని అందజేసి అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. 80 శాతం ఉన్న హిందువులను అస్తికులను కించపరిచిన బైరి నరేష్ కండకవురంతో హిందు దేవుళ్ళను కించపరుస్తున్నాడని ఇలాంటి వారిని వదిలేస్తే మరొకడు తయారవుతాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. బైరి నరేష్‌పై తమిళనాడు, కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి అరెస్టు చేయించాలని పేర్కొన్నారు.

**కొత్తపేట చౌరస్తాలో స్వాముల నిరసన...** హిందూ దేవతలపై బైరి నరేష్ వ్యాఖ్యలు చేయడం పట్ల అయ్యప్ప స్వామి భక్తులు కొత్తపేట రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. నరేష్ పై కేసు నమోదు చేసి అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని అయ్యప్ప స్వాములు డిమాండ్ చేశారు.

# బెస్ట్ పురోహిత్ అవార్డు అందుకున్న శివశంకర శాస్త్రి


అవార్డు అందుకుంటున్న శివశంకరశాస్త్రి

**సైదాబాద్, డిసెంబరు 30 ప్రభాతవార్త:** ఎల్‌బినగర్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయ శ్రీ సాయిబాబ దేవాలయం అర్చకులు పండరి శివశంకర్ శాస్త్రి, సురభి అకాడమి వారిచేత బెస్ట్ పురోహిత్ ఆఫ్ ది ఇయర్ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సురభి లక్ష్మీ శారద, జబర్దస్త్ ఫేమ్ రాకెట్ రాఘవ, ఫణి, జెమిని నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి : ముద్దగౌని


డిస్నీ స్పోర్ట్స్ జోన్‌ను ప్రారంభించిన ముద్దగౌని తదితరులు

**వనస్థలిపురం, డిసెంబరు 30 ప్రభాతవార్త:** ఆటలు శరీర దృఢత్వం, మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని బిఆర్ఎస్ ఎల్బీనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని అనంతవేణినగర్‌లో నిర్వాహకులు చంద్రశేఖర్‌గౌడ్ నూతనంగా ఏర్పాటు చేసిన డిస్నీ స్పోర్ట్స్ జోన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ గౌడ్ మాట్లాడుతూ ఆటలు శరీర,మానసిక దృఢత్వానికి దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వంశీ, రాజేందర్, రవి, ఈశ్వర్, మల్‌రెడ్డి, ఘట్టయ్య, సురేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల్లో వ్యర్థ, కలుషిత జలాలు చేరకుండా చర్యలు తీసుకోవాలి


చెరువుల పరిశీలనలో బీజేపీ నాయకులు

**హయత్‌నగర్, డిసెంబరు 30 ప్రభాతవార్త:** పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీపరిధి పసుమాముల గ్రామంలోని రాయం చెరువు, పోచమ్మ చెరువులను శుక్రవారం బీజేపీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఇంఛార్జ్ కొత్త అశోక్‌గౌడ్ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్ ప్రాంతాల నుంచి వస్తున్న మురుగునీటితో పాటు స్థానికంగా ఉన్న కంపెనీల కాలుష్యం చెరువులలో చేరడంతో అవి మురికి కూపంగా మారుతున్నాయని తెలిపారు. వ్యర్థ రసాయనాలతో భూగర్భ జలాలు సైతం రంగు మారి కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు వ్యాధుల భారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారని, దోమలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాలుష్యం కారణంగా చెరువుల్లో చేపలు మృత్యువాత పడడంతో మత్స్యకారులు జీనవోపాధిని కోల్పోతున్నారన్నారు. 3 పర్యాయాలుగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా కొనసాగుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఈ సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యారని ఆయన మండిపడ్డారు. ఎన్నికలసమయంలో సమస్య పరిష్కారంపై హామీలిస్తూ అనంతరం వాటిని పట్టించుకోకపోవడం ఎమ్మెల్యేకు పరిపాటిగా మారిందన్నారు. వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోనిపక్షంలో విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు తలారి వీరస్వామి, పిల్లి శ్రీనివాస్‌యాదవ్, మధుగౌడ్, సంగి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : కోమలి కృష్ణారెడ్డి


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణారెడ్డి తదితరులు

**మలక్‌పేట, డిసెంబరు 30 ప్రభాతవార్త:** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మలక్‌పేట న్యూ హోప్ అసోసియేషన్ సంస్థ ప్రధాన కార్యదర్శి కోమలి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. సంస్థ ఆధ్వర్యంలో స్టేట్ లెవల్ కో ఆర్డినేటింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో 5 రోజులపాటు సికింద్రాబాద్ సెయింట్ ఆన్స్ జనరలేట్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 8 జిల్లాలలోని ఎన్జీవోలలో విధులు నిర్వహిస్తున్న కో ఆర్డినేటర్లు, కౌన్సిలర్లు హాజరయ్యారు. కాగా మాస్టర్ ట్రైనర్ సూర్యప్రకాష్‌రావు, తిరుమగల్, రేష్మామాలిక్, సుధారాణిలు పదార్థ వినియోగం యొక్క విభిన్న నేపథ్య సమస్యలపై శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో సంజీవ్‌కుమార్, సిద్దేశ్వర్, సుదర్శన్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# తొక్కిసలాటలో మృతి చెందిన కార్యకర్తలకు నేతల నివాళి


తొక్కిసలాటలో మృతి చెందిన కార్యకర్తలకు ఉప్పల్ చౌరస్తాలో నివాళులు అర్పిస్తున్న టిడిపి నేతలు

**ఉప్పల్, డిసెంబరు 30 ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా కందుకూరులో తొక్కిసలాటలో మృతి చెందిన టిడిపి కార్యకర్తలకు ఉప్పల్ టిడిపినేతలు ఘనంగా నివాళులర్పించారు. టిడిపి మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జీ కందికంటి అశోక్‌కుమార్ గౌడ్, ఉప్పల్ డివిజన్ అధ్యక్షుడు తిక్క ప్రకాష్, చిలుకానగర్ డివిజన్ అధ్యక్షుడు పబ్బతి శేఖర్‌రెడ్డి, కల్లూరు వేణు, డా.అశోక్, సాయినాగార్జున,గిరిబాబు, హేమంత్, అవినాస్, విజయ, శివయ్య తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఏపిలో టిడిపి మహాసభకు భారీ ఎత్తున ప్రజలు హాజరవుతున్నారని అన్నారు. బహిరంగసభలో జరిగిన తొక్కిసలాటలో వీరమరణం చెందిన కార్యకర్తలకు తమ వంతు నివాళి అర్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి కృషి : రాజేశ్వర్‌రెడ్డి


చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న భాస్కర్‌రావు తదితరులు

**మలక్‌పేట, డిసెంబరు 30 ప్రభాతవార్త:** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని నోబుల్ విద్యా సంస్థల చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మూసారాంబాగ్‌లోని నోబుల్ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ విద్యార్థుల దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుత పోటీ యుగంలో విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ భాస్కర్ రావు, అధ్యాపకులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్చాలను అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శారద, ప్రమీల, నాయుడు, హుస్సేన్, ప్రమోద్, రాజు, వెంకటేష్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# హామీలు నెరవేర్చడంలో బిఆర్ఎస్ ప్రభుత్వం విఫలం


సమావేశంలో పాల్గొన్న బిజెపి నాయకులు

**తుర్కయంజాల్, డిసెంబరు 30 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన టిఆర్ఎస్ పార్టీ ఎనిమిదేళ్లవుతున్న ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని మాజీ ఎమ్మెల్యే, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని రొక్కం సత్తిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో జిల్లా ఎస్టి మోర్చా అధ్యక్షుడు ధారావత్ శ్రీనివాస్ నాయక్ అధ్యక్షతన ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల బిజెపి ఎస్టీ మోర్చా శిక్షణ కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి కార్యకర్త ఉత్సాహంతో పని చేసే పార్టీని బలోపేతం చేయాలని సూచించారు పనిచేసే వారికి పార్టీలో తగిన గుర్తింపు తప్పకుండా లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్టి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయక్ ఎనిమిది జిల్లాల అధ్యక్షులు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# హిందూ దేవతలను కించపరిచిన నరేష్‌ను అరెస్టు చేయాలి: సురేష్


ఇన్‌స్పెక్టర్ సీతారాంకు వినతి పత్రం అందజేస్తున్న సురేష్

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 30 ప్రభాతవార్త:** హిందూ దేవతలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన నరేష్ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని రంగారెడ్డి జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు ఆరుట్ల సురేష్ డిమాండ్ చేశారు. హిందూ దేవుళ్ళ మీద నీచంగా మాట్లాడిన భారత నాస్తిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి నరేష్ నాస్తిక ముసుగులో హిందూ సమాజంపై కుట్రలు అయ్యప్ప, శంకరుడు, విష్ణు దేవుళ్ళపై నీచంగా మాట్లాడడంపై నిరసన వ్యక్తం చేస్తూ శుక్రవారం అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఇన్స్పెక్టర్ సీతారాంకు బిజెపి నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ హిందూ సమాజాన్ని దేవతలను అవహేళన చేసే విధంగా వ్యాఖ్యలు చేస్తున్న ఇటువంటివారిని కఠినంగా శిక్షించాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బెంగర బోయిన సురేష్, ఫణి స్వామి, కిసాన్ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి రామారావు, బీజేవైఎం నాయకులూ బద్రి, శైలేష్, వెంకట్, మనోహర్, వేణు, ప్రవీణ్, శివ పాల్గొన్నారు.

# దివి క్లబ్ అధ్యక్షుడుగా శ్రీనివాస్‌యాదవ్


శ్రీనివాస్‌యాదవ్‌ను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

**వనస్థలిపురం, డిసెంబరు 30 ప్రభాతవార్త:** లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దివి క్లబ్ అధ్యక్షుడుగా చాపల శ్రీనివాస్‌యాదవ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా గవర్నర్ జూలూరి రఘు ఆధ్వర్యంలో సికింద్రాబాద్ లయన్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన పదవీ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఆయన ప్రమాణం చేసారు. ఈ కార్యక్రమంలో దివి క్లబ్ సభ్యులు జిల్లా వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డా. కోటేశ్వర్‌రావు, రీజియన్ ఛైర్మన్ కె.యాదయ్యగౌడ్, జడ్పీ ఆనంద్ చెక్కిళ్ళ, ధరణి క్లబ్ అధ్యక్షుడు రామ్మోహన్‌కోట్ల, జిల్లా నాయకులు చీఫ్ ఎడిటర్ పి.రమేష్ చంద్రబాబు, ధీరేందర్ బండారి, ఆదిరెడ్డి, నాగరాజు, లింగయ్య సురేష్ జ్ఞాని పాల్గొన్నారు.

# యాప్రాల్‌లో హెచ్‌డిఎఫ్‌సి 300వ బ్రాంచీ ప్రారంభం

**నేరెడ్‌మెట్ డిసెంబర్ 30 ప్రభాతవార్త:** వినియోగదారులకు మెరుగైన సేవలను అందించేందుకు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఎల్లప్పుడు ముందుంటుందని ప్రముఖ వ్యాపారవేత్త, జి.కె రాజ్ కన్‌స్ట్రక్షన్ గ్రూప్ మెనేజింగ్ డైరెక్టర్ ఎల్. నాగేశ్వర్ రావు పేర్కొన్నారు. శుక్రవారం నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని యాప్రాల్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన హెచ్‌డిఎఫ్‌సి 300వ బ్రాంచీని ఆయన బ్రాంచి మెనేజర్ సతీష్, సిబ్బందితో కలసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో ఇతర బ్యాంకులతో పోలి స్తే హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకులు ఎక్కువ సంఖ్యలో బ్రాంచీలను కలిగిఉందన్నారు. హెచ్‌డిఎఫ్‌సిబ్యాంకు ఎంతోమంది ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మెనేజర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# బైరి నరేష్‌పై సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు


సిఐ సుబ్బరామిరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న గంగిశెట్టి రాజేష్

**సైదాబాద్, డిసెంబరు 30 ప్రభాతవార్త:** కోట్లాది మంది భక్తులు ఆరాధ్యదైవంగా కొలిచే అయ్యప్ప స్వామితో పాటు ఇతర హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖా ్యలు చేసిన బైరి నరేష్‌ను వెంటనే అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని కోరుతూ మలక్‌పేట నియోజకవర్గం బిజెపి ఓబిసి మోర్చా కన్వీనర్ గంగిశెట్టి రాజేష్ శుక్రవారం సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరామిరెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం రాజేష్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో కొంతమంది హిందూదేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడమే పనిగా పెట్టుకున్నారని మండి పడ్డారు. హిందూ సమాజం సంఘటితంగా ఇలాంటి కుట్రలను ఎదుర్కోవాల్సి ఉందన్నారు. బైరి నరేష్‌లాంటి మూర్ఖులకు తగిన బుద్ది చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో నవీన్ కుమార్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

# హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పెరిగిన కేసులు

**హయత్‌నగర్, డిసెంబరు 30 ప్రభాతవార్త:** హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గత ఏడాదితో పోల్చితే 362 కేసులు అధికంగా నమోదయ్యాయి. 2021లో 1026 కేసులు నమోదు కాగా 2022లో 1388 కేసులు నమోదయ్యాయి. ప్రధానంగా గంజాయి సరఫరా చేస్తున్న ముఠాలపై పోలీసులు దృష్టి సారించి 15 కేసులు నమోదు చేశారు. 2809 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 30 మంది నిందితులను రిమాండ్‌కు తరలించారు. దొంగతనాల విషయానికి వస్తే గతేడాది 165 కేసులు నమోదు కాగా 102 కేసులను పోలీసులు చేధించారు. 2022కు సంబంధించి 1,37,73,100 ప్రాపర్టీ లాస్ కాగా 1,14,61,100 రికవరీ(83 శాతం) చేశారు. నగర శివారు ప్రాంతం కావడంతో హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో భూవివాదాలు, చీటింగ్ కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. 149 మిస్సింగ్ కేసులు నమోదు కావడం విశేషం. ఈ ఏడాది ఆఖరు రోజున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని నూతన సంవత్సర వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ప్రజలకు సూచించారు. ముఖ్యంగా డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.వాటి వినియోగం చట్టరిత్యా నేరమని ఎవరైనా వినియోగించినట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు నేరుగా కానీ 100, 94906 17111, 94906 17161 నెంబర్ల సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

# తెలంగాణ క్లాస్ ఫోర్ వికారాబాద్ ఉద్యోగుల కార్యవర్గ కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన క్లాస్ ఫోర్ ఉద్యోగ కార్యవర్గ కమిటీ సభ్యులు

**హైదరాబాద్, డిసెంబరు 30 ప్రభాతవార్త:** తెలంగాణ నాలుగవ తరగతి ఉద్యోగుల సెంట్రల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని జిల్లా కౌన్సిలర్ సభ్యుల తీర్మాణాల మేరకు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతన అధ్యక్షునిగా ఎండి.అక్బర్, సహాయ అధ్యక్షులుగా పి.పాండు, జె.బాలకృష్ణ యు.నాగరాజు సి.వెంకటయ్య సంయుక్త కార్యదర్శి కె.శారద, కె.శ్రీనివాస్, కోశాధికారి డి.సాయి కృష్ణ, కార్యనిర్వాకకార్యదర్శి కాజాపాషా, ప్రచార కార్యదర్శి డి.కాశీనాథ్ కార్యాలయ కార్యదర్శి పి.శివకుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి క్లాస్ ఫోర్త్ అధ్యక్షులు జ్ఞానేశ్వర్, ఎండి ఖాన్, సీఎన్జీవోస్ అధ్యక్షులు లక్ష్మణ్, పిఎన్జిఎస్ కార్యదర్శి బుచ్చిరెడ్డి, ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ సుధాకర్, సెక్రటరీ నాగభూషణం, జిల్లా గిరిజన అభివృద్ధిఅధికారి ఆర్.కోటాజీ, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఉప్పల్ పెద్ద చెరువులో గుర్రపు డెక్క తొలగింపు : బన్నాల గీత


ఉప్పల్ పెద్ద చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 30 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్‌లో దోమల నివారణకు చెరువులలో గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపడుతున్నామని స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం చిలుకానగర్ డివిజన్ హైకోర్టుకాలనీలో గుర్రపు డెక్క తొలగింపు పనులను పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో దోమల నివారణకు ప్రత్యేకంగా గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపడుతున్నామన్నారు. ఎఫ్‌టిసి మిషన్ ద్వారా గుర్రపు డెక్క తొలగించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నామన్నారు. ప్రజలు ప్లాస్టిక్ కవర్లు, చెత్త చెదారం వేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ జోనల్ చీఫ్ గంగప్ప, ఎఇ నరేష్‌రెడ్డి, సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, డివిజన్ కార్యదర్శి కె.జగన్, బాలు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# అనుచిత వ్యాఖ్యలు చేసిన నరేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి : రాంకోటేశ్వరరావు


ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న రాంకోటేశ్వర్‌రావు తదితరులు

**మలక్‌పేట, డిసెంబరు 30 ప్రభాతవార్త:** అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బిజెపి రాష్ట్రకార్యదర్శి వేమూరి రాంకోటేశ్వరరావు డిమాండ్ చేసారు. అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌పై చర్యలు తీసుకోవాలని మలక్‌పేట మున్సిపల్ కాలనీ అయ్యప్పస్వామి ప్రతినిధులు చాదర్‌ఘాట్ పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నరేష్‌పై కేసు నమోదు చేసి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

# అష్టలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న కుర్మాచలం

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 30 ప్రభాతవార్త:** ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలోని శ్రీ అష్టలక్ష్మి అమ్మవారిని శుక్రవారం తెలంగాణ స్టేట్ ఫిల్మ్, టీవీ, థియేటర్ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ కుర్మాచలం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఉద్యమకారులు ఆయనకు పుష్పగుచ్చాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బీరెల్లి వెంకట్‌రెడ్డి, కొండ్ర శ్రీనివాస్, డివిజన్ కార్యనిర్వాహక అధ్యక్షులు కంచర్ల శేఖర్, మాజీ ఏరియా కమిటీ మెంబర్ మంచుకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# హిందూ దేవతలను అవమానిస్తే సహించేది లేదు : ఆకుల శ్రీవాణి


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 30 ప్రభాతవార్త:** హిందూ దేవతలను అవమానిస్తే సహించేది లేదని సరూర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ కుమార్ హెచ్చరించారు. బైరి నరేష్ హిందూ దేవతామూర్తులను అవహేళన చేస్తూ వ్యాఖ్యలు చేయడం పట్ల శుక్రవారం ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ దేవతలను విమర్శిస్తే పెద్ద నాయకులం అవుతామని ఆలోచనతో ఇటువంటి విమర్శలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇతర మతస్థుల దేవతలను విమర్శిస్తే వారు ఊరుకుంటారా అని, హిందూ ధర్మం హింసను ప్రోత్సహించదు అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని కార్పొరేటర్ సూచించారు. హిందూ దేవతలను అవహేళన చేయడం కొందరికి ఫ్యాషన్ గా మారిందని మండిపడ్డారు. భవిష్యత్తులో ఇటువంటి వ్యాఖ్యలు చేస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

# బిజెపి బలోపేతానికి కంకణ బద్ధులు కావాలి : కటకం


సమావేశంలో మాట్లాడుతున్న కటకం నర్సింగ్ రావు

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 30 ప్రభాతవార్త:** బిజెపి బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కంకనబద్ధులు కావాలని బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కటకం నర్సింగ్ రావు పేర్కొన్నారు. కోతపేట డివిజన్ లోని బూతు నెంబర్ 159,164, 187 సమావేశం శివగంగ కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు నడుం బిగించాలన్నారు. దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాల గురించి విస్తృత ప్రచారం చేపట్టాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్ కుమార్, శక్తి కేంద్ర ఇన్చార్జిలు, స్టేట్ కౌన్సిల్ సభ్యులు కొర్లపల్లి స్వామి, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర సభ్యుడు అంబాల మల్లేశం గౌడ్, బూతు కమిటీ అధ్యక్షకార్యదర్శులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే చర్యలు


సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

**హయత్‌నగర్, డిసెంబరు 30 ప్రభాతవార్త:** అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి పనులు వేగవంతంగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన డివిజన్ పరిధిలోని బంజారాకాలనీలో కొనసాగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులతో పాటు పాతగ్రామంలోని రాజరాజేశ్వరి ఆలయ వీధిలో సీసీరోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనులలో నాణ్యతను అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. డ్రైనేజీ పనులలో మ్యాన్‌హోళ్లతో పాటు సీసీరోడ్డుకు సరిపడ క్యూరింగ్ చేయాలని సూచించారు. కార్పొరేటర్‌తో పాటు జలమండలి మేనేజరు రాజు, కాలనీల ప్రతినిధులు రఘుపతినాయక్, బంజానాయక్, హరినాయక్ పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో విద్యార్థికి గాయాలు

**మలక్‌పేట, డిసెంబరు 30 ప్రభాతవార్త:** రోడ్డు దాటుతున్న తండ్రి, కుమార్తెలను వేగంగా వచ్చిన ఓ ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో గాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మలక్‌పేట మున్సిపల్ కాలనీకి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి సాయి పరిమళ (18)తన తండ్రి రవికుమార్తఓ కలిసి మలక్‌పేటలో శుక్రవారం ఉదయం రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం వారిని మలక్‌పేట యశోద ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునా న్నరు.

# చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి


కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ తహాశీల్దార్ రాజు తదితరులు

**మలక్‌పేట, డిసెంబరు 30 ప్రభాతవార్త:** ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని సైదాబాద్ మండల డివ్యూటీ తహశీల్దార్ రాజు అన్నారు. శాలివాహన నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఎస్సీ సబ్ ప్లాన్ కమిటీ మెంబర్ మైలపాక రాంచందర్ అధ్యక్షతన నిర్వహించిన పౌర హక్కులపై అవగాహన సదస్సు ఆయన మాట్లాడుతూ సమాజంలో వివక్షతకు గురైతే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. హక్కులకు భంగం కలిగితే చట్టాల ద్వారా న్యాయం పొందవచ్చన్నారు. ఎవరైనా దాడులు, బెదిరింపులకు పాల్పడిన నిర్భయంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. గుడిసెలలో డ్రైనేజ్, మంచినీటి, వీదిదీపాలు, మౌళిక వసతులు కల్పించాలని బస్తీ గుడిసెవాసులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట ఎస్సై సురేష్, సోషల్ వెల్ఫేర్ అధికారి రాజ్యలక్ష్మి, ఆర్ఐ హరిబాబు, ప్రభాకర్, ఎల్లేష్, సుమన్, కుమార్, నర్సింహ్మా, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.